
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 నవంబర్ 2022
5
వైఎస్ఆర్



చట్టాలపై అవగాహన అవసరం : జడ్జి

ప్రజాశక్తి - కడప

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత సూచించారు. శుక్రవారం డిఎల్ఎస్ఎ ఆధ్వర్యంలో సుదూర ప్రాంతాల పేదలకు న్యాయ సేవలు, గ్రామీణ కార్మికుల కోసం సంక్షేమ పథకాలు, వివాహ చట్టాలు, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అనే అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుదూర ప్రాంతాల పేదలకు న్యాయ సేవలు పారా లీగల్ వాలంటీర్లు, ఎన్జిఒలు, న్యాయవిజ్ఞాన సదస్సులు, ఇంటింటి న్యాయ ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామీణ కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1098, 14567 పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది చంద్రకాంతమ్మ, పారా లీగల్ వాలంటీర్ వసంతం, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హైమావతి, హ్యూమన్ రైట్స్ స్టేట్ ప్రెసిడెంట్ మేరీ ప్రియాంక, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్వాడీ వ్యవస్థను కాపాడాలి

ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో యూనియన్ ఏడవ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ నిర్వహణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు పెంచకుండా నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కేవలం రూ.1000 పెంచి అంగన్వాడీలను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే అంగన్వాడీ భవనాలను నిర్మించి ఇవ్వాలని పేర్కొన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణకు సంబంధించి చేంతాడంత హామీలు ఇచ్చి వాటికి తగిన విధంగా బడ్జెట్ కేటాయించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ప్రచారానికి ఆర్భాటం చేస్తుందే తప్ప అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని పేర్కొన్నారు. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, జి. చంద్రశేఖర్, రామమోహన్, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, నాయకులు సలీమా, వినోదా దేవి, ఆర్. లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మి, సుహాసిని, అంజలీదేవి, వినీల, ధనలక్ష్మి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.ఎన్ సుబ్బమ్మ, సెక్టార్ పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

అధిక దిగుబడులు సాధించేలా ప్రణాళికలు

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

సాగులో అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులు ఎక్కడా నష్టపోకుండా లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు అమలు చేయాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ విజయ్ రామరాజు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని స్పందన హాలులో వ్యవసాయ, ఉద్యాన, నీటి వనరులు, మార్కెటింగ్, ప్రకృతి వ్యవసాయం, మత్స్యశాఖ, మార్క్ ఫెడ్ శాఖలతో వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం జిల్లా అగ్రికల్చర్ అడ్వయిజరీ బోర్డ్ చైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా విస్తృతమైన సేవలు అందివ్వాలని సూచించారు. జిల్లాలోని 735 రెవెన్యూ గ్రామాలకు గాను 680 గ్రామాల్లో 2,33,575 ఎకరాల్లో పంటల సాగుకుగాను పూర్తి స్థాయిలో ఇ క్రాప్ కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సహకాల కారణంగా ఈ ఖరీఫ్ లో సాధారణ సాగుబడి కంటే 135 శాతం అధికాకంగా సాగుబడిని పెంచగలిగామన్నారు. రబీ సీజన్ సన్నద్ధతలో భాగంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీతో రైతులకు విత్తనాలను, ఎపి మార్క్ ఫెడ్ ద్వారా నాణ్యమైన ఎరువులను అందుబాటులో ఉంచి విక్రయించాలన్నారు. పంట సాగుబడిలో విత్తనం మొదలు దిగుబడి వరకు అన్ని దశల్లో క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల వారీగా ఆర్‌బికెల పరిధిలో వ్యవసాయ సహాయకులు సీజన్ వారీగా ఆయా ప్రాంతాల్లో పండించే పంటలు, వాటికి ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ, ఆయా పంటలకు అందాల్సిన పోషక విలువలు, ఎరువుల వాడకం మొదలైన ప్రక్రియల నిర్వహణపై ముందస్తుగా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగేశ్వర రావు, ఉద్యానశాఖ డిడి మైఖేల్ రాజీవ్, 'ఆత్మ' పీడీ విజయకుమారి, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.శారద, సిఎం ఎన్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) డిపిఎం రామకృష్ణ, మార్కెటింగ్ శాఖ ఎడి హిమశైల, ఫిషరీస్ ఎడి, సివిల్ సప్లై మేనేజర్ సుబ్బారెడ్డి, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, ఎపి ఎస్పీడిసిఎల్ ఎస్ఇ, మైనర్ ఇరిగేషన్, సహకార, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

జగన్‌ను ఇంటికి పంపించే సమయం ఆసన్నమైంది

- పిసిసి అధ్యక్షులు సాకే శైలజానాథ్

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో అసమర్ధ పాలకుడైన సిఎం జగన్ మోహన్ రెడ్డిని ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందని పిసిసి అధ్యక్షులు సాకే శైలజానాథ్ అన్నారు. శుక్రవారం పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనువాసరావుతో కలిసి వేంపల్లెలోని రాజీవ్ నగర్ సమీపంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలను పరిశీలించారు. అలాగే ఇంటి నిర్మాణం చేసు కొంటున్న లబ్ధిదారులతో కలిసి బిల్లులు ఇంటి స్థలంపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడంబరం, ఆర్భాటం, అణిచివేతతో సిఎం జగన్ ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. రాష్ట్రం ఇప్పటికే సర్వ నాశమైందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయక పోవడంతో పాటు అప్పులతో రాష్ట్రం మునిగి పోయిందని చెప్పారు. రాజధాని కూడా రాష్ట్రానికి లేదన్నారు. వైసిపి ప్రభుత్వం ఎస్సీలకు చెందిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేసిందని తెలిపారు. బిసిలను, రైతులను పట్టించుకొన్న పాపాన లేదని వాపోయారు. నరేంద్ర మోడీ కాళ్లు చూడడం తప్ప, కనీసం ముఖం లేపి చూడలేని అధైర్యవంతుడు జగన్ అని విమర్శించారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాల జగన్ పరిపాలనలో చెప్పిన దాంట్లో మూడున్నర శాతం కూడా చేయలేదన్నారు. వేంపల్లెలో 620 ఇళ్లకు గాను ఒక్క ఇల్లు కూడా పూర్తికాలేదని ఎద్దేవా చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షల 80 వేల వరకు యూనిట్ ధర పెంచాలన్నారు. వారి వెంట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, పులివెందుల ఇన్‌ఛార్జి వేలూరు శ్రీనువాసులు రెడ్డి, నజీర్ అహ్మద్, సత్తార్, జకరయ్య, ధృవకుమార్ రెడ్డి, విష్ణు వర్ధన్, చంద్రశేఖర్ రెడ్డి, పూల నజీర్, చార్లెస్, శ్యామలా దేవి, మావిళ్ళ బాబు, ఉత్తన్న, రామకృష్ణ, నరసింహారెడ్డి, రాఘవయ్య, బద్రీ, చెన్నకేశవ, సుబ్రహ్మణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న శైలజానాథ్

విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ

పోరుమామిళ్ల : మండలంలోని రంగసముద్రం పంచాయతీలోని కస్తూరిబా పాఠశాలలో మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేతిరాత నిపుణులు మల్లేశ్వర రెడ్డి సహకారంతో గుడ్ హ్యాండ్ రైటింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సంస్థ మేనేజింగ్ ట్రస్టీ చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి ,సంస్థ వ్యవస్థాపకులు చిత్తా రవి ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న 270 మంది కస్తూరిబా పాఠశాల బాలికలకు కాపీ రైటింగ్ బుక్ లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతిరాత అందంగా ఉండడం వల్ల విద్య పైన ఆసక్తి పెరుగుతుందన్నారు. పరీక్షలలో మంచి మార్కులు వస్తాయన్నారు. కార్యక్రమం రెండు రోజులు ఉంటుందని, పాల్గొన్న వారికి చివరిలో ఒక పరీక్షల పెట్టి విజేతలకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగలక్ష్మి, రెడ్డమ్మ పాల్గొన్నారు.

క్విజ్, చెస్ పోటీలు

కడప అర్బన్ :గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కడప కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో జయనగర్ కాలనీలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్,చెస్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ పోటీలలో 9 గ్రూపులు, చెస్ పోటీలలో 13 గ్రూపులు పాల్గొన్నాయి. క్విజ్ మాస్టర్‌గా బీదపుష్పరాజు వ్యవహరించారు. చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అహ్మద్ అనీష్ , ఆయనకు సహాయకులుగా ఆర్బిటర్ టి .శ్రీకాంత్ చెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రరీయన్ పవన్ కుమార్, లైబ్రరీయన్లు జేమ్స్, సురేష్, సుబ్రహ్మణ్యం సిబ్బంది పాల్గొన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఏ.డి దేవదత్తం, మంజులవాణి , రూత్ ఆరోగ్య మేరీ, రంగనాయకులు, చంద్రశేఖర్ రెడ్డి కార్యక్రమాలు విజయవంతం చేశారు.

నేడు ఆర్ట్స్ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవం

కడప : ఆర్ట్స్ కళాశాలలో మొదటి సారిగా ఈనెల 19న నిర్వహిస్తున్న పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమానికి కళాశాలల కమిషర్ డాక్టర్ పోలా భాస్కర్, వైవియు ఉపకులపతి సూర్యకళావతి ముఖ్య అతిథులుగా హాజరువుతున్నట్లు తెలిపారు. 2020-21, 2021-22 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు గ్రాడ్యుయేషన్ దినోత్సవానికి హాజకుకావాలని కోరారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు.

కార్తీక వనభోజన కరపత్రాలు ఆవిష్కరణ

కడప : తొగటవీర క్షత్రీయ సంక్షేమ సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కనుమ లోపల్లిలో గల 108 శివలింగాల మహాలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణంలో నిర్వహించే 'కార్తీక మాస వనభోజన కార్యక్రమం కరపత్రాలను శుక్రవారం తొగటవీర క్షత్రీయ సంక్షేమ సంఘం నాయకులు స్థానిక కార్యాల యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ తొగటవీర క్షత్రీయ కులబాంధవులు కుటుంబ, సపరివారిసమేతంగా తప్పక విచ్చేసి కార్య కమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొగటవీర క్షత్రీయుల ఆత్మీయ పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు. పిల్లలకు, పెద్దలకు ఆటల, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రీయ సంక్షేమ సంఘం నగర శాఖ అధ్యక్షులు కళ్యాసుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, కోశాధికారి టేకూరి సుదర్శన్, గౌరవాధ్యక్షులు పల్లా బాలచౌడన్న, ఉపాధ్యక్షులు బండి కృష్ణయ్య, కళ్యా శ్రీనివాసులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

గ్రామీణ నీటి సరఫరా లక్ష్యాన్ని అధిగమించాలి

కడప అర్బన్ :జల్ జీవన్ మిషన్ లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణ నీటి సరఫరా లక్ష్యాన్ని అధిగమించి ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ సదుపాయం కల్పించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న శుద్ధ తాగునీటి సరఫరా పనుల పురోగతిపై అసిస్టెంట్ కలెక్టర్ రాజీవ్ మీనా తో కలిసి ఆయా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యశాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా శుద్ధ తాగునీటి సరఫరా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాల అమలు పనితీరును మెరుగు పరిచేందుకు క్రమం తప్పకుండా నాణ్యతా పరీక్షలను నిర్వహించాలని క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వీరన్న, ఇఇలు, డిఇలతో పాటు ఎఇఇలు పాల్గొన్నారు. **లింగ నిర్ధారణకు పాల్పడితే క్రిమినల్ కేసులు** జిల్లాలో లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామ రాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. తన ఛాంబర్లో గర్భస్థ లింగ నిర్ధారణ, మాతా శిశు మరణాలు అంశాలపై జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల నిష్పత్తిని పెంచడానికి అధికారులు, ఎన్‌జిఒలు, ప్రజలు అందరూ భాగస్వామ్యం వహించాలని, ఆడబిడ్డను ప్రతి ఒక్కరు కాపాడుకుందామని కలెక్టర్ పిలుపునిచ్చారు. భృణహత్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలీసు శాఖ వారి సహకారం కూడా తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. పాంప్లెట్లు, ప్రచార కరపత్రాల ద్వారా బ్రూణ హత్యలపై వైద్య ఆరోగ్య, ఐసిడిఎస్ శాఖలు సంయుక్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.

కెఎస్ఆర్ఎంలో సెమినార్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప శివారులోని కెఎస్ ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్మెంట్ సెల్ విభాగం వారి ఆధ్వర్యంలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 'రీ-ఇంజినీరింగ్ యువర్ సెల్ఫ్'అనే అంశంపై ప్రముఖ సంస్థ కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ సారథ్యంలో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ శ్రీధర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సాంకేతిక, పోటీ ప్రపంచంలో ప్రభుత్వ, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగ సాధనకు ముఖ్యంగా కావాల్సిన ఆయుధాలు వెంటనే ఆలోచనతో కూడిన పరి జ్ఞానం అవసరమన్నారు. కార్పొరేట్ రంగంలో ఒడిదుడుకులు తట్టుకుని ఎద గాలంటే కళా నైపుణ్యం ఎంతో ముఖ్యమైన అంశమని చెప్పారు. ఆనాటి మేధా వులలో ఒకరైన మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ పితామహుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంని ఆదర్శంగా తీసుకుని అనుకున్న లక్ష్యం చేరాలన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) , ప్రధానాచార్యులు డాక్టర్ వివిఎస్ మూర్తి, కంపెనీ ప్రతినిధులు సీనియర్ మేనేజర్ ఎన్ఎస్ రెడ్డి, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎల్.ప్రేమానందరెడ్డి, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ సిద్దిక్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



డైరెక్టర్ శ్రీధర్‌ను సన్మానిస్తున్న చంద్ర ఓబుల్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కడప : ప్రజా సంక్షేమం వైసిపి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కడప నియోజకవర్గ సీనియర్ నేత, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలో నిర్వహించిన గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటూ ఎవరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి, ఎవరికి అందలేదని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు నారపరెడ్డి సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు శ్రీరంజన్‌రెడ్డి, కె.బాబు, రెడ్డి ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు సహీర్ అహ్మద్, అన్వర్, బాషా, నాయకులు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

కడప సిటీ : విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని భక్త మల్లారెడ్డి గ్లోబల్ ఫౌండేషన్ చైరన్మన్, సామాజిక కార్యకర్త సుమతి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలాజీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మానవతా విలువలు, వ్యక్తిత్వ వికాసం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి ప్రభావం వల్ల ప్రస్తుత తరం పిల్లల్లో కుటుంబ విలువలు లోపిస్తున్నాయని తెలియ జేశారు. ముఖ్యంగా పిల్లలు మమ్మీ డాడీ అనే పిలుపులకు స్వస్తి చెప్పి స్వచ్ఛమైన తెలుగులో అమ్మానాన్న అని సంబోధించాలని కోరారు. ముఖ్యంగా అమ్మాయిలు స్వయంకృషితో కష్టపడి వారి మనుగడను చాటుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు టెలివిజన్ అనే పిశాచిని, పిల్లలు మొబైల్ అనే దెయ్యాన్ని దూరం చేస్తే ఆ కుటుంబం అన్ని విధాలా పురోగతి చెందుతుందని చెప్పారు. అటువంటి కుటుంబ వ్యవస్థల వల్ల దేశంలో చాలా మార్పులు తీసుకొని రావచ్చని తెలిపారు. ప్రతి విద్యార్థి భావి భారత పౌరులుగా మారాలని పిలు పునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వీర సుదర్శన రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు సుమతి రెడ్డిని సన్మానించారు.



సుమతిరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కడప సిటీ : స్థానిక ఎర్రముక్కపల్లెలోని జార్జి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైమ్ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబి రానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరం ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రతాప్ బృంగి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించారు. శిబిరానికి సుమారు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్, థైరా యిడ్, ఎముకలు, ఊపిరితిత్తులు, నరాల పరీక్షలు చేసి రోగులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. అవసమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రైమ్ ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ గంగాప్రసాద్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ అక్షిత చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొని వైద్యసేవలందించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రతాప్

రైతాంగ సమస్యలపై పోరాటాలకు శ్రీకారం

కడప అర్బన్ రైతాంగ సమస్యలపై, రైతాంగం ప్రయోజనాలను కాపడేందుకు ఏపీ రైతు సంఘం అలుపెరగని పోరాటాలకు శ్రీకారం చుడుతుందని జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి తెలిపారు. శుక్రవారం రైతు సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు రైతులకు చాలా ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. రైతాంగ ఉద్యమ అభివృద్ధి కోసం పలు అంశాలపై తీర్మానాలను చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయాలని, రైతులకు మద్దతు ధర కాగితాలకే పరిమితం కాకుండా వారికి దక్కే విధంగా ఉండాలని పేర్కొన్నారు. ఆర్‌బికెలలో అన్ని వసతులు కల్పించి రైతులకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు, వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మోటర్లు రద్దు చేయాలని, మార్కెట్ యార్డుల్లో దళారీ వ్యవస్థను అరికట్టాలని చెప్పారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు కోసం రానున్న కాలంలో రైతులను సమీకరించి ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుట్టాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు జయప్రదం అవడానికి సహకరించిన రైతు శ్రేయోభిలాషులకు జిల్లా కమిటీ తరపున అభినందనలు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, నాయకులు కోటిరెడ్డి, రామచంద్రారెడ్డి, చిన్న సిద్దయ్య పాల్గొన్నారు.

అరెస్టులతో కార్యకర్తల్ని ఆపలేరు

ప్రజాశక్తి - కడప అర్బన్

అరెస్టులతో టిడిపి నాయకులను, కార్యకర్తలను ఆపలేరని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియావుద్దీన్ అన్నారు. శుక్రవారం అక్రమ కేసుపై గత నెలలో జైలుకెళ్లి ఇటీవల విడుదలైనా ప్రొద్దుటూరు తెలుగు పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్ కుమార్‌రెడ్డి ని పరా మర్శించారు. ఈ సంద ర్భంగా జియాఉద్దీన్ మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ప్రొద్దుటూరులో రోజు రోజుకూ ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అక్రమకేసులు బనా యించారని చెప్పారు. జైలుకైతే పంపగలిగారే కాని ప్రొద్దు టూరు ప్రజల గుండెల్లో ఆయన స్థానాన్ని చెరపలేరని చెప్పారు. ప్రవీణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో అద్భుతమైన స్పందన లభిస్తోందని తెలిపారు. ఇది చూసి భయపడి వైసిపి నాయకులు నాయకులపై , కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని, ప్రజల కోసం ప్రజా సమస్యలకోసం రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నగర ఉపాధ్యక్షులు మహమ్మద్‌షా, మైనారటీ నాయకులు సయ్యద్ నాయబ్, సూర్యతేజ, జహీర్,మమ్మద్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



ప్రవీణ్ కుమార్ రెడ్డితో జియావుద్దీన్

శాంతిభద్రతలకు కృషి

పోరుమామిళ్ల :సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలు కృషి చేస్తానని పోరుమామిళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సిఐగా బాధ్యతలు చేపట్టారు. రాయచోటి జిల్లాలోని కలకడ సర్కిల్ నుచి పోరుమామిళ్ల సర్కి ల్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తాననిచెప్పారు. కేసుల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని చెప్పారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సురేష్‌బాబు విఆర్‌కు బదిలీ అయ్యారు.



బాధ్యతలు చేపట్టిన సిఐ సురేష్‌రెడ్డి

వైద్య ఆరోగ్య శాఖలో కౌన్సెలింగ్

ప్రజాశక్తి- కడప సిటీ

వైద్య ఆరోగ్యశాఖలో శుక్రవారం స్థానిక ఆర్‌డి కార్యాలయంలో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరి ఆధ్వర్యంలో స్టాఫ్‌నర్సులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 143 జిఒ ప్రకారం అదనపు సిబ్బందిని సర్దుబాటు చేయడంలో భాగంగా ఒక పిహెచ్‌సిలో మూడు స్టాఫ్ నర్సులు మాత్రమే ఉండాలన్నారు. రెగ్యులర్ స్టాఫ్ నర్సులు, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు కౌన్సె లింగ్ నిర్వహించమన్నారు. మొత్తం 104 మందికి కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని చెప్పారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకరు ఓపి సేవలు నిర్వహణకు, మరొకరు వైద్యుడు క్షేత్రస్థాయిలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను పర్యవేక్షి ంచనున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ పత్తి కొండ శ్రీను, సీనియర్ అసిస్టెంట్లు రాఘవేంద్రరావు, రామాంజనేయులు, కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్‌డి కోటేశ్వరి

సామాజిక సేవ అభినందనీయం

కడప అర్బన్ : ఖిద్మత్ ఫౌండేషన్ ద్వారా సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సంఘ సేవకులు సలావుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం రిమ్స్‌లో ఖిద్మత్ ఫౌండేషన్ వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి పలు ప్రాంతాలలో అన్నదానాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా కాలంలో పాత, కొత్త రిమ్స్‌లలో అన్నదాన కార్యక్రమం చేపట్టారని తెలిపారు. దాతలు సహకరిస్తే మరికొన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో మెడికల్ క్యాంపు, ఉచిత అంబులెన్స్, ఉచిత రేషన్ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న సలావుద్దీన్

చెకుముకి సంబరాలు విజయవంతం

ప్రజాశక్తి-కడప అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నగరంలోని సిఎస్ఐ స్కూల్‌లో విజయవంతంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. తమ అమూల్యమైన సందేశాన్ని అందించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడి దేవదత్తం, జిల్లా కార్యదర్శి సుజన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు వెంకటరామరాజు, జిల్లా కార్యదర్శి సునీత, జిల్లా విద్యా కమిటీ కన్వీనర్ రూత్ ఆరోగ్య మేరీ, నగర కమిటీ ఉపాధ్యక్షులు కరిముల్లా, కోఆర్డినేటర్ కిరణ్, జిల్లా కార్యదర్శి గోవింద్, నగర కార్యదర్శి రామ్, యూత్ కమిటీ సభ్యులు రోహిత్, రెడ్డయ్య, మహేష్ హాజరైనారై విజయవంతం చేశారు. మొదటి స్థానంలో ధనుష్, తులసినాథ్, వేద వర్షన్, ద్వితీయస్థానం విక్రమ్, స్టాలిన్, ఏసుబాబు విజయం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ప్రయివేట్ స్కూల్ నుంచి శ్వేత కిరణ్మయి, గౌరీప్రణయ్, లోకేశ్వర్, ద్వితీయ స్థానం భవాని మనోజ్ఞ, సోఫియా, రిత్విక్ జిల్లాస్థాయి ఎంపికయ్యారు. **పోరుమామిళ్ల టౌన్:** ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జడ్‌పి హైస్కూల్‌లో జెవివి ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. అనంతరం విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, సిఐటియు జిల్లా కమటీ సభ్యులు భైవరప్రసాద్, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, కృష్ణశారద, అధ్యాపకులు నరసింహ పాల్గొన్నారు. **వల్లూరు :** మండలంలోని వనరుల కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ మూర్తి సురేష్ బాబు తెలిపారు. విద్యార్థులు టీ. పల్లవి రెడ్డి పదవ తరగతి ,వెంకట దివ్య 9 వ తరగతి , రెహమాన్ 8వ తరగతి మండలస్థాయి చెకుముకి టెస్ట్‌లో ప్రతిభ కనబరిచారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేశారు. సందర్భంగా ప్రిన్సిపల్ సురేష్ బాబు మాట్లాడుతూ ఇలాగే పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మరింత ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు.



పోరుమామిళ్ల: మాట్లాడుతున్న డాక్టర్ చక్రవర్తి

24న 'రారా' శతజయంతి సదస్సు

కడప అర్బన్ : సాహిత్య అకాడమీ, యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్త నిర్వహణలో రారా (రాచమల్లు రామచంద్రారెడ్డి) శతజయంతి సదస్సును ఈనెల 24, ఉదయం 10.00 గంటలకు సి.పి. బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నామని పరిశోధన కేంద్రం బాధ్యులు డాక్టర్ మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రారంభ సమావేశంలో ముఖ్యఅతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం విసి సూర్యకళావతి, సభాధ్యక్షులుగా సాహిత్య అకాడమి తెలుగు సలహా మండలి కన్వీనర్ కె.శివారెడ్డి, గౌరవ అతిథిగా సాహిత్య అకాదెమి పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పాల్గొంటారని తెలిపారు. అనంతరం రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అధ్యక్షతన 'మార్క్సిస్టు విమర్శకుడుగా రారా', చింతకుంట శివారెడ్డి 'రారా జీవితం, వ్యక్తిత్వం' అనే అంశాలపై పత్ర సమర్పణ చేస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ముగింపు సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్టర్ దుర్భాక విజయ రాఘవ ప్రసాద్ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు.

తెగుళ్ల నివారణకు రైతులకు సూచనలు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - లింగాల



పంటను పరిశీలిస్తున్న అధికారి రమేష్, సిబ్బంది

వరి పంటలను ఆశించిన తెగుళ్ల నివారణకు మండల వ్యవసాయాధికారులు పలు సూచనలు చేశారు. 'వరికి తెగుళ్ల– రైతుల్లో ఆందోళన' అనే శీర్షికన శుక్రవారం 'ప్రజాశక్తి' దిన పత్రికలో కథనం రావడంతో అధికారులు స్పందించారు. ఆ మేరకు వ్యవసాయ అధికారులు శుక్రవారం వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రమేష్ మాట్లాడుతూ మెడ ఇరుపు, అగ్గి తెగులు, పొట్టకుల్లు తెగుళ్ల ఉన్నాయని తెలిపారు. వీటి నివారణకు సంబంధించి ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

తలనీలాల ఆదాయం రూ.18.05 లక్షలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఏడాది పాటు తలనీలాలు, టెంకాయల విక్రయాలు చేపట్టేందుకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. ఆలయ ఇఒ శ్రీనివాసులు, చైర్మన్ జిటి వెంకటసుబ్బారెడ్డి, ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. తలనీలాల వేలంపాటలో తమిళ నాడుకు చెందిన శ్యామ్ కుమార్ రూ. 18.05 లక్షలు వేలం పాట పాడి అవకాశాన్ని దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 16.80 లక్షలు తలనీలాలకు ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.లక్ష 30 వేల వరకు ఆదాయం పెరిగింది. టెంకాయలకు, టిఫిన్ సెంటర్ నిర్వహణకు సరైన ధర రాకపోవడంతో వేలం పాటను వాయిదా వేశారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వ్యాపారులు, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

చాపాడులో వన్ వే ట్రాఫిక్

ప్రజాశక్తి - చాపాడు



చాపాడు నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల రద్దీ

మైదుకూరు–ప్రొద్దుటూరు ప్రధాన రహదారిలో చాపాడు వద్ద రోడ్డుకు మరమ్మత్తు పనులు చేపడు తుండడంతో రోడ్డుకు ఒక వైపును మాత్రమే రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. జాతీయ రహదారిపై అధికంగా లారీలు, కార్లు, బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. చాపాడు పోలీస్‌స్టేషన్ నుంచి కాశినాయన వృద్ధాశ్రమంలోని పెట్రోల్ బంకు వరకు రోడ్డుకు ఒకవైపు మాత్రమే రాకపోకలు అనుమతించారు. ఒకేవైపునే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అనేకసార్లు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఒకటి రెండు రోజుల్లో మరమత్తు పనులు పూర్త వుతాయని, అంతవరకు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని రోడ్డు కాం ట్రాక్టర్, సిబ్బంది సూచిస్తున్నారు. పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నెట్ బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

నెట్ బాల్ పోటీల్లో జాతీయ స్థాయికి శ్రీచైతన్య విద్యార్థి రమాకాంత్‌రెడ్డి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్ర పాణిరెడ్డి తెలిపారు. విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ పోటీల్లో రమాకాంత్‌రెడ్డి మంచి ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. చాలా సంతోషంగా ఉందని శుక్రవారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చేతన్‌రెడ్డి పాల్గొన్నారు.




విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

రాంబాబు కేసును పునఃపరిశీలించాలి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని చియ్యపాడు ఎస్‌సి కాలనీకి చెందిన గుడి వెంకటరాంబాబు మృతి కేసును పోలీసులు పునఃపరిశీలించాలని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ కోరారు. ఆ మేరకు శుక్రవారం రాంబాబు కుటుంబ సభ్యులతో కలిసి ఆర్‌డిఒకు వినతి పత్రమిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నెల 28న కమలాపురం వద్ద పెన్నా సుదర్శన్‌రెడ్డి ట్రాక్టర్‌పై నుండి కిందపడి రాంబాబు మృతి చెందిన సంఘటన తెలిసిందేనన్నారు. ఈ సంఘటన ఉద్దేశపూర్వకంగా జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై న్యాయం చేయాలని రాంబాబు భార్య ప్రమీల వారి కుటుంబ సభ్యులతో ఆర్‌డిఒ శ్రీనివాసులును కలిసినట్లు తెలిపారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు బిఎస్ కర్ణ మాదిగ, డప్పు కళాకారుల సంఘం జిల్లా నాయకులు ఓబులేసు, రాంబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రమిస్తున్న బాధితులు

అంధుల ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక శ్రీనివాస్ థియేటర్ సమీపంలోని ఉన్న శ్రీ వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో శుక్రవారం కావేరి జబ్బు జగనన్న వర్ధంతి సందర్భంగా కావేరి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అనిమేల రమాదేవి, రామమోహన్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా నడుచుకోవాలి : ఎస్‌పి

రాయచోటి టౌన్ : ఆయా సమస్యలపై స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేవారి పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా పట్టణంలోని సబ్‌డివిజన్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి ఎస్‌సి, ఎస్‌టి, మహిళా కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు దారుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. డివిజన్ పరిధిలో ఉన్న మహిళా పోలీసు సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పలు సూచనలు ఇచ్చారు. అదనపు ఎస్‌పి డాక్టర్ వి. బి రాజ్ కమల్, రాయచోటి డిఎస్‌పి పి. శ్రీధర్, సిఐ రాజారెడ్డి పాల్గొన్నారు.

వికేంద్రీకరణతో సమానాభివృద్ధి సాధ్యం

రామాపురం : అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధి చెందాలంటే వికేంద్రీకరణతోనే సాధ్యమని వైసిపి అన్నమయ్య జిల్లా ప్రచార కార్యదర్శి జాకీర్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధి చెందినప్పుడే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయని చెప్పారు. అన్ని ప్రాంతాల ప్రజలు సంతోషంగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన ప్రతిపక్ష పార్టీలు మూడు రాజధానులు అభివృద్ధి చెందితే తమ పార్టీలు మూసుకోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారని చెప్పారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

ఇష్టపడి చదవాలి : గ్రంథాలయ చైర్‌పర్సన్ ఉషారాణి, వైఎస్ మధు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పాత సత్రం పాఠశాలలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి, వేముల మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి (వేల్పుల రాము) ఆధ్వర్యంలో నిర్వహించిన 55వ గ్రంథాలయ వారోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. కార్యక్రమానికి అతిథులుగా వైసిపి తొండూరు మండల ఇన్‌ఛార్జి వైఎస్ మధుసూదన్‌రెడ్డి, పులివెందుల పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, డిఎస్‌పి శ్రీనివాసులు, సర్వ శిక్ష అభియాన్ డైరెక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, గ్రంథాలయ జిల్లా కార్యదర్శి, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నాదెండ్ల బాబ్జీ, ఎపి పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పురపాలక చైర్మన్ వల్లెపు వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, రంగస్వామి గుడి చైర్మన్ సుధీకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఉషారాణి, వైఎస్ మధురెడ్డితోపాటు పలువురు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వెళ్లాలన్నారు. విద్యపై సిఎం జగన్ ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. గ్రంథాలయాలు కను మరుగవుతున్న తరుణంలో వైసిపి ప్రభుత్వం రాగానే జగనన్న సచివాలయాలను ఏర్పాటు చేసి ఆ కేంద్రాల్లో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేసేలా రూపకల్పన చేశారని వివరించారు. మొట్టమొదటిసారిగా రాష్ట్రంలోనే పులివెందుల నియోజకవర్గం వేముల మండలం వేల్పుల సచివాలయంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలను ఇంత ఘనంగా జరపడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రంథాలయాల వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలను నిర్వహించారు. 150 మంది విద్యార్థులకు అధికారులు, నాయకులు బహుమతులు అందజేశారు. అనంతరం అతిథిగా వచ్చిన ప్రతి ఒక్కరికి వేల్పుల రాము, ఉషారాణి శాలువా కప్పి మెమెంటోలను అందించారు. ముందుగా వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమ ప్రారంభానికి ముందు సత్రం పాఠశాల నుంచి విద్యార్థులతో డప్పు వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ వివి నరసింహారెడ్డి, ఎంఇఒ వీరారెడ్డి, కౌన్సిలర్ కిషోర్, గ్రంథాలయ లైబ్రేరియన్ కృష్ణకిషోర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రాము యువసేన సభ్యులు పాల్గొన్నారు.



వైఎస్ మధును సన్మానిస్తున్న రాము, ఉషారాణి, నాయకులు

విభిన్న ప్రతిభావంతుల సేవే ధ్యేయం

నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా.. : ప్రముఖ సామాజికవేత్త షేక్ మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి - కడప అర్బన్

విభిన్న ప్రతిభావంతులకు సేవ చేయడమే ధ్యేయంగా 2000 సంవత్సరం నుంచి పని చేస్తున్నాని ప్రముఖ సామాజికవేత్త షేక్ మహమ్మద్ రఫీ తెలిపారు. శనివారం అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఈ సందర్భంగా సమాజానికి సేవ చేసిన వారిని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కువగా కష్టపడుతూ విభిన్న ప్రతిభావంతులను సాధారణ పిల్లలుగా తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. మానసిక విభిన్న ప్రతిభావంతులు దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన సేవలను గుర్తించి షేక్ పర్వీన్ నాజ్ తనను వివాహం చేసుకుందని తెలిపారు. కడప కోర్టులో న్యాయవాదిగా ఉన్నారని చెప్పారు. ఈ ఏడాది జూన్‌లో ఒక మానసిక విభిన్న ప్రతిభావంతుడికి ఉద్యోగం వచ్చేలా చేశామన్నారు. అల్–షిఫా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. సైకాలజీ డిపార్టుమెంట్ కడపకు వచ్చేలా కృషి చేశామని తెలిపారు. 2014లో అస్ట్రేలియాలో ప్రత్యేక ఒలంపిక్స్‌లో ఎపి నుంచి పాల్గొన్నామని తెలిపారు. అనేక మెడల్స్ సాధించామన్నారు. అనేక విన్నపాలు, పోరాటాల అనంతరం 2016లో మానసిక విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సాధించామని పేర్కొన్నారు. 15 మంది విద్యార్థులు స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్నారని చెప్పారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ చెప్పినట్లు మానసిక విభిన్న ప్రతిభావంతల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. 22 సంవత్సరాలుగా వీరికి సేవచేస్తూన్నానని తెలిపారు. యువత కూడా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేశామని పేర్కొన్నారు. సమాజంలో అవగాహన తీసుకొస్తున్నామన్నారు. పురుషులు కూడా సేవ చేస్తున్నారనే విషయం ప్రతి ఒక్కరూ గమనించాలని ఆయన కోరారు.



సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని, వాటిని పరిష్కరించేందుకు ముందుంటాని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శుక్రవారం స్థానిక ని 7వ వార్డుల్లో పర్యటించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, అనంతరం ఆయన మాట్లా డుతూ ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తేవాలన్నారు. సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల పనితీరుపై నేరుగా ప్రజల తో మాట్లాడి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న 2024 ఎన్నికలలో వైసిపిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, వైస్ చైర్మన్, సింగ రయ్య, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ మార్బుల్ శీను, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, శానిటరీ నూర్‌బాషా, మున్సిపల్ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

షాహి ఈద్గా ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. షాహి ఈద్గా ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 30ఏళ్లుగా ఈ ప్రహరీ నిర్మాణానికి ఎంతో ప్రయత్నం చేస్తున్నారని, ఆ అవకాశం తనకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో 17వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి బేపారి షామీర్ అలీ, 18వ వార్డు కౌన్సిలర్ గౌరీనాథ్, పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ముల్లా జానీ, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్సు టాలెంట్ టెస్ట్ పోటీలకు విశేష స్పందన లభించినట్లు జెవివి జిల్లా కార్యదర్శి శ్రీనువాసులు తెలిపారు. శుక్రవారం వేంపల్లెలో అక్షర జూనియర్ కళాశాలలో మండలస్థాయిలో ఈ పరీక్షలను నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన 15 టీంలు హాజరైనట్లు చెప్పారు. మొదటి స్థానంలో ప్రతిభ చూపిన విద్యార్థి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు. మండల స్థాయిలో జరిపిన సైన్సు టాలెంట్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థినులు దక్కించుకోగా, తృతీయ బహుమతి స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థి సాధించినట్లు తెలిపారు. విజేతలకు బహుమతులను అక్షర కళాశాల కరెస్పాండెంట్ భారతి, యుటిఎఫ్ నాయకుడు మహేష్ బాబు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు కరీముల్ల, కేశవులు, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం ఖజా పర్వీన్, ఉపాధ్యాయులు వరప్రసాద్, ద్వారకానాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, జ్యోతి, శ్యామల, చందన పాల్గొన్నారు. **చాపాడు (మైదుకూరు) :** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి మండలస్థాయి సైన్స్ సంబరాలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలగంగాధర్ మాట్లాడుతూ చెకుముకి వంటి టాలెంట్ టెస్టులు రాయడం వల్ల విద్యార్థుల్లో మేథాశక్తి పెరుగుతుందన్నారు. పరీక్షలో ప్రథమ స్థానంలో తెలుగు మీడియంలో నిలిచిన మైదుకూరు జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ఎస్.రోహిత్‌కుమార్, సి.యాసిన్, ఎస్.మహమ్మద్ అలీకి బహుమతులను అందజేశారు. ఆంగ్ల మాధ్యమంలో శాంతినికేతన్ విద్యార్థులు ప్రథమంగా నిలిచారు. వీరు జిల్లాస్థాయి చెకుముకి సంబరాలకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సూర్యనారాయణ రెడ్డి, ఉన్నత పాఠశాల జెవివి మండల అధ్యక్షుడు సుబ్బయ్య, సోషల్ మీడియా కన్వీనర్ గురులాల్, సమతా కన్వీనర్ శివ నాగలక్ష్మి, యూత్ కన్వీనర్ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** స్థానిక రెయిన్ బో పాఠశాల విద్యార్థులు మండలస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్ష పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి జిల్లాస్థాయి ఎంపికయ్యారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన ప్రతిభ పోటీ పరీక్షల్లో లక్ష్మీ శ్రావ్యరెడ్డి, సాయికార్తీక్, తేజవర్ధన్‌రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు శుక్రవారం వర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి సైన్సు సంబరాలు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విజయవంతమయ్యాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.వినయ్‌కుమార్ తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి క్రిష్టపర్, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ప్రశ్నపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలాల వారీగా జిల్లాస్థాయికి ఎంపికయ్యారన్నారు. 8,9,10 తరగతులకు మండలస్థాయిలో పరీక్ష రాసిన వారికి మొదటి, రెండవ, మూడవ బహుమతులు అందజేశామన్నారు. జిల్లా స్థాయిలో డిసెంబర్ 10,11తేదీల్లో, రాష్ట్రస్థాయిలో జనవరి 7,8 తేదీల్లో పరీక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, ఎస్‌ఎఫ్‌ఐ సునీల్, భానుప్రసాద్, నితీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : మనిషిని చదువు ఉన్నత స్థాయిలో నిలబెడుతుందని, ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించే విధంగా కృషి చేయాలని ఎఎస్‌పి ప్రేరణకుమార్ సూచించారు. జెవివి ఆధ్వర్యంలో శుక్రవారం చెకుముకి మండలస్థాయి సైన్స్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సరస్వతి, డాక్టర్ డి.నరసింహారెడ్డి. దీప్తి కళాశాల కరెస్పాండెంట్ బాలసుబ్బారెడ్డి, దండపాణి గ్రూప్స్ అధినేత శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కమిషనర్ రంగస్వామి, జెవివి అధ్యక్షులు మురళీగుప్త, సభ్యులు, సురేష్, మధుసూదన్, ఉషారాణి, రాజేష్, డాక్టర్ చక్రధర్, మీనా, హేమలత, ఉత్తమ్‌రెడ్డి, శైలజ, అక్షత, శర్వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు



ఖాజీపేట :జిల్లాస్థాయికి ఎంపికైన రెయిన్ బో విద్యార్థులు

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రతి ఒక్కరూ ఆధార్ అప్డేషన్ తప్పక చేయించుకోవాలని కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి ఆధార్ మోనిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ కార్డు కలిగిన ప్రతి వ్యక్తీ పదేళ్లకు ఒక సారి తప్పనిసరిగా తమ ఆధార్ అప్డేషన్ చేయించుకోవాలన్నారు. సచివాలయాలలోను , ఆధార్ నమోదు కేంద్రాలు చేస్తారన్నారు. . జిల్లాలో ప్రస్తుతం 62 సచివాలయాలలో ఆధార్ అప్డేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో అన్ని సచివాలయాలలో ఆధార్ అప్డేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. 5, 15 సంవత్సరాలు దాటిన పిల్లలు తమ బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. 2010 నుంచి 2016 సంవత్సరంలో ఆధార్ కార్డు వచ్చిన వారు అవసరమైన పత్రాలతో ఆధార్ అప్డేషన్ చేయించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడం, విద్యాసంస్థల్లో ప్రవేశం, బ్యాంకుల్లో ఖాతాలు తదితర అవసరాలకు ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రస్తుతం బిడ్డపుట్టిన వెంటనే శిశుకు కూడా ఆధార్ కార్డు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, అడిషనల్ ఎస్‌పి రాజ్ కమల్, రాయచోటి, రాజంపేట, మదనపల్లె ఆర్‌డిఒలు కోదండరామరెడ్డి, రంగస్వామి, మురళీ, హైదరాబాద్ ఆధార్ రీజినల్ ఆసిఫ్ ఆఫీస్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ పద్మజ, ప్రాజెక్టు మేనేజర్ జావిద్ పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు సొమ్ము చెల్లింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఇళ్ల లేని నిరుపేదలు టిడ్కో ఇంటి నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లించిన సొమ్మును ఎమ్యేల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు చెక్కుల రూపంలో తిరిగి చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం ఇళ్లు కట్టిస్తామని మూడు రకాలుగా అడ్వాన్స్ డబ్బులు వసూలు చేసిందన్నారు. 5000 మంది దరఖాస్తు చేసుకోగా 903 మంది మాత్రమే గృహ నిర్మాణానికి డబ్బులు చెల్లించారన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక వారిని మోసం చేసిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులు చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని ఇచ్చిన మాట మేరకు చెక్కులను పంపిణీ చేయడం సంతోషకంగా ఉందన్నారు. వారందరికి ఇంటి పట్టాలతోపాటు నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా రూ.1.80లక్ష మంజూరు చేయిస్తామన్నారు. ఇందుకు కేవలం రూ.35వేలు చెల్లిస్తే ఇంటి నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్ల అప్పగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కమిషనర్ వెంకటరమణయ్య, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

22న కలెక్టరేట్ వద్ద ధర్నా : యుటిఎఫ్

ప్రజాశక్తి - వేంపల్లె

ఉద్యోగ, ఉపాధ్యాయలకు చెందిన దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఈనెల 21న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. ఆ మేరకు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామం సమయంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ధర్నాకు చెందిన కరపత్రాలను ఉపాధ్యాయలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్‌బాబు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలతోపాటు అవసరాల కోసం దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ అమౌంట్లను, సరెండర్ లీవ్ బిల్లులను మంజూరు చేయకుండా ప్రభుత్వం మానసిక క్షోభకు గురి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావలసిన డిఎలను, బకాయిలను సకాలంలో చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సంపాదిత సెలవులు, సరెండర్ చేసిన డబ్బులను విడుదల చేయకపోవడం శోచనీయం అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై ఉన్న ప్రేమ ప్రజల్లో భాగస్వామునైనా ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ప్రభుత్వానికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం బకాయి పడిన డిఎలను వెంటనే చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు, మండల గౌరవాధ్యక్షుడు వన్నూరు బాషా, నాయకులు దేవదానం, సతీష్, భాస్కర్, బాలాంజనేయులు, ప్రధానో పాధ్యాయులు ఓబులేసు పాల్గొన్నారు.



ధర్నా కరపత్రాలను అవిష్కరిస్తున్న యుటిఎఫ్

విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

ప్రధాన వ్యవసాయ పంటల్లో విత్తనోత్పత్తి, సాగుపై యువ రైతులకు మండల పరిదిలోని రాజుపాలెం గ్రామం వద్ద సదాశివారెడ్డి రైతు పొలంలో ఏరువాక శాస్త్ర వేత్తలు, ఆత్మ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరువాక శాస్త్రవేత్తలు రామలక్ష్మి, డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ పద్మలత మాట్లాడుతూ జిల్లాలో కొంతమంది యువరైతులను గుర్తించి ప్రధాన వ్యవసాయ పంటల్లో విత్తనోత్పత్తిపై ఈ నెల 14 నుంచి 21వరకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రాజుపాలెం వద్ద మినుము పంటలో శిక్షణ ఇస్తున్నామన్నారు. వరి, వేరుశనగ, మినుము, పెసర, శెనగ వంటి పంటలపై విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరువాక, ఆత్మ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మినుము పంటలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

21న వాహనాల వేలం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 21న వేలంపాట నిర్వహిస్తున్నట్లు జమ్మలమడుగు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కెఎస్ లత ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు ఆధార్ కార్డు, ఏదైనా ప్రూఫ్ తీసుకొని వేలంలో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు.

ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని నూతనంగా ట్రాఫిక్ సిఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన బదిలీపై పులివెందుల ట్రాఫిక్ సిఐగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం డిఎస్‌పిని కలిశారు. ట్రాఫిక్ ఎస్‌ఐ హాజీవల్లితో పట్టణంలో ట్రాఫిక్ గురించి చర్చించారు.



ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపు వస్తుందని అమృత హస్త సేవ నిధి అధ్యక్షుడు రాజు అన్నారు. స్థానిక అమ్మవారిశాల వీధికి చెందిన కాంబోజి వెంకటసుబ్బమ్మ శుక్రవారం మృతి చెందారు. ఆమె కుమారులు గంగాధర, మల్లికార్జున, రమణ, కుమార్తెలు గంగాదేవి, భాగ్యలక్ష్మి, చంద్ర కళావతి, ప్రసన్నలక్ష్మి వెంకటసుబ్బమ్మ నేత్రదానానికి అంగీకరిస్తూ రాజుకు సమాచారమిచ్చారు. నేత్రనిధి టెక్నీషియన్ హరీష్ ఆమె పార్థివదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు.

పార్టీ విజయానికి ప్రతి కార్యకర్తా కష్టపడాలి

ప్రజాశక్తి - లింగాల

వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పులివెందుల నియోజకవర్గం క్లస్టర్ ఇన్‌ఛార్జి భరత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం లింగాల రామ నూతనపల్లి, పెద్ద కూడాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తప్పకుండా టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. ఇన్నాళ్లు పడిన కష్టాలు తీరిపోతాయన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ ఓటు గురించి తెలుసుకోవాలన్నారు. రెండు దఫాలుగా ఓట్లు తీసేయడం, మళ్లీ ఎక్కించడం జరిగిందన్నారు. వీటిలో మీ ఓటు ఉందో లేదో చూసుకోవాలన్నారు కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి యూత్ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు మేనేజర్ మృతి

ప్రజాశక్తి - కాశినాయనా

అమగంపల్లె సమీపంలో టిబి హాస్పిటల్ దగ్గర శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇటుకలపాడు ఎపిజి బ్యాంకు మేనేజర్ జాన్‌విక్టర్ (54) అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలం చేరుకున్నారు. మృతుడు అమగంపల్లెలో ఉంటున్నాడు. తెల్లవారుజామున వాకింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.